పశుగణన ఎంతగానో ఉపయోగపడుతుంది

వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త : పశుగణన పెంపకం దారులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. 21వ అఖిల భారత పశు గణన గోడపత్రికలను ఆవిష్కరణ, పశు గణన కార్యక్రమం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ పశు వైద్యశాల వెంకటగిరి పరిధిలోని వెంకటగిరి, దక్కిలి రెండు మండలాలలో 25 అక్టోబర్ 2024 నుండి 28 ఫిబ్రవరి 2025 వరకు 21వ అఖిల భారత పశు గణన చేపట్టేందుకు అన్ని చర్యలు తీసుకున్నారని తెలిపారు. గ్రామీణ భారతదేశంలో పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరు, ఇది జాతీయ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి గణనీయంగా దోహదపడుతుందన్నారు. వ్యవసాయం పై ఆధారపడిన కుటుంబాలకు పశు పోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందన్నారు. వెంకటగిరి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డా.ఎం.వి స్వామి బాబు మాట్లాడుతూ పశుగణన మొట్టమొదటి సారిగా 1919 - 1920వ సంవత్సరాలకు ఒక సారి నిర్వహిస్తారన్నారు. ఇప్పటి వరకు 20 పశుగణనలు నిర్వహించబడ్డాయని, చివరి పశు గణన 2019లో చేశారన్నారు. 21వ పశు గణన 25 అక్టోబర్, 2024న ప్రారంభం కానుందన్నారు. ఈ పశు గణన ద్వారా పశువులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పందులు, గుర్రాలు, వివిధ రకాల కోళ్ళు పక్షులతో సహా 16 రకాల పెంపుడు జంతువులపై జాతులు వారీగా సమాచారాన్ని సేకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో పారవోలు పశువైద్యాధికారి డా. కిషోర్, సిబ్బంది పాల్గొన్నారు.

మా సత్యవేడు నియోజకవర్గం...

-తలలు పట్టుకుంటున్న తెలుగు తమ్ముళ్లు -అధిష్టానం మౌనం వేడాలని వెడుకోలు
- అధికార పార్టీ ఎమ్మెల్యే వున్నా అభివృద్ధికి నోచుకొని వైనం

పరిస్థితి ఏంటబ్బా!

సత్యవేడు, అక్టోబరు 25 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని టీడీపీ కార్యకర్తలు, నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఈ రోజు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే తమిళనాడుకు ఆనుకుని ఉన్న సత్యవేడు నియోజకవర్గంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై ఎలాంటి స్పందన పెద్దగా కనిపించడం లేదు. ఎమ్మెల్యే ఆదిమూలం మహిళా లైంగిక వేధింపు దాడి కేసులో ఇరుక్కుని రాజీ మార్గంలో ఆ కేసు నుంచి బయటపడ్డారు. ఈ వ్యవహారంలో అధిష్టానం ఆదిమూలంను సస్పెన్షన్ చేసిన విషయం తెలిసిందే. ఆదిమూలం మద్దతుదారులు పలుమార్లు సస్పెన్షన్ తీసేయాలని మండల కేంద్రాల్లో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. విజయవాడకు వెళ్లి రాష్ట్ర పార్టీ కార్యాలయం వద్ద కూడా సస్పెన్షన్ ఎత్తి వేయాలని వినతులు సమర్పించారు. ఇదిలా ఉండగా పల్లె పండుగ కార్యక్రమంలో కూడా కొన్ని గ్రామాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సస్పెన్షన్ తొలగింపు వ్యవహారం అధిష్టానం నేటికీ ఓ కొలిక్కి తీసుకురాలేకపోతుంది. ఎమ్మెల్యే సస్పెండ్ చేసిన అధిష్టానం, నియోజకవర్గ టీడీపీ అధ్యక్షురాలుపై ఎలాంటి క్రమశిక్షణ చర్య తీసుకోలేదని విమర్శలు ఉన్నాయి. ముందు సంబంధిత మహిళ తనను వేధించి లైంగిక వేధింపుదాడికి దిగారనిపోలీసులకు ఫిర్యాదు చేయడం, వెంటనే వివిధ సెక్షన్ల కింద ఆదిమూలంపై తిరుపతి ఈస్ట్ పోలీసులు ఆగమేగాలపై కేసు నమోదు చేశారు. అదే వేగంతో ఆదిమూలం హై కోర్టులో క్యాష్ పిటిషన్ వేయడం, చివరకు ఫిర్యాదు దారి(మహిళ) కోర్టులో తనను ఎవరు ఇబ్బందులు పెట్టలేదంటూ అనేకంశాలు ప్రస్తావిస్తూ న్యాయవాది ద్వారా స్వచ్ఛందంగా అఫిడవిట్ సమర్పించడంతో కేసు రద్దు చేశారు. కేసు రద్దు కావడంతో సస్పెన్షన్ వ్యవహారంపై అందరి దృష్టి మళ్లింది. అధిష్టానం మాత్రం సస్పెన్షన్ వ్యవహారంలో ఎలా ముందుకు వెళ్లాలి...? తొలగిస్తే వచ్చే ఇబ్బందులు...? ప్రజలకు ఎలాంటి సంకేతాలు వెలుతాయి అనే అంశాలపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలిసింది. తాజాగా ఎమ్మెల్యే మహిళతో అసభ్యంగా మాట్లాడే ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కూడా కొట్టింది. ఇదిలా ఉండగా ఇప్పటికే తెర వెనుక ఉన్న అనేక మంది పార్టీ గాడ్ ఫాదర్లు సత్యవేడుపై దృష్టి మళ్లించారు. మండల స్థాయి అధికారులను రిమోట్ చేస్తూ తమ మద్దతు దారులకు, తమకు అనుకూలమైన వారికే పనులు జరిగే విధంగా చూస్తూ వస్తున్నారనే ఆరోపణలు టీడీపీలో బలంగా వినిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో తమకు ఎలాంటి పనులు జరగడం లేదని వైసీపీ నేతల భూ కబ్జాలపై ఫిర్యాదులు ఇస్తే అవి బుట్ట దాఖలు అవుతున్నాయని, పేదలకు ఏ కార్యాలయంలోను న్యాయం జరిగే పరిస్థితులు కనిపించడం లేదని అందు వల్లే తాము ఆఫీసులకు వెళ్ళడం లేదని పంచాయతీ శ్రేణి నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు నియోజకవర్గంలో ఎలా విజయవంతం అవుతాయనే అన్న ప్రశ్నలకు టీడీపీ శ్రేణుల్లో సమాధానం దొరకడం లేదు. పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చంద్రశేఖర్‌నాయుడు, శ్రీపతిబాబు ఇప్పటికే అధిష్టానం వద్దకు నియోజకవర్గంపై పలు ఫిర్యాదులు చేర్చారు. అయితే పల్లె పండుగకు తాత్కాలికంగా అధిష్టానం కో-ఆర్డినేటర్‌గా సూళ్లూరుపేట ప్రాంతానికి చెందిన శ్రీపతిబాబుని ఇక్కడ తిప్పించారు. పల్లె పండుగ ప్రభుత్వకార్యక్రమం కాబట్టి చాలా..బాగానే సాగింది. అయితే ఊరు వాడతో పాటు పలు ప్రాంతాల్లోను సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జరగాల్సి ఉంది. ఎవరి నాయకత్వంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టాలో అర్థం కాక మండల స్థాయి నాయకులు మౌన ముద్రంలోకి వెళ్లిపోతున్నారు. అందు వల్లే నియోజకవర్గంలో ఈ కార్యక్రమంపై పెద్ద స్పందన లేదని తెలుస్తోంది. ఇక అభివృద్ధి కార్యక్రమాలు అంటారా...కనీసం రోడ్ల మీద బావులను తలపించే గుంతలను పూడ్చే దిక్కు కూడా లేదు. అధికారులకు ఫిర్యాదు చేస్తే చూస్తామని ఉచితంగా పేర్కొనడం మినహా స్పందన లేదని స్థానిక నాయకత్వం ఆవేదన వ్యక్తం చేస్తోంది. అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంతటిజాప్యం ఎలా జరుగుతుందో చెప్పడానికి వేల ఉదాహరణలు ఉన్నాయని పార్టీ క్యాడర్ చెబుతోంది. ఈ నేపథ్యంలో టీడీపీ అధిష్టానం సత్యవేడుపై దృష్టి పెట్టి అత్యవసర చర్యలు తీసుకోకపోతే ఇబ్బందులు మూడింతలు పెరిగే అవకాశాలు లేకపోలేదని టీడీపీ సీనియర్ నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మున్సిపాలిటీలో నిధుల్లేక...
మూలపడ్డ ట్రక్కులు

-శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో పారిశుద్ధ్యం అధ్వాన్నం

మున్సిపాలిటీలో మూల పడ్డ ట్రాక్టర్లు, ట్రక్కులు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారింది. మూడు నాలుగు రోజులుగా చెత్తలను తొలగించే ట్రాక్టర్లు మూలపడ్డాయి. జవాబుదారి లేని అధికారులుపట్టించుకోక పోవటంతో పట్టణంలో పారిశుద్ధ్యం అధ్వానంగా మారింది.అయితే పారిశుద్ధ్య కార్మికులు ఉన్న పాత ట్రాక్టర్లతోనే పనులు చేస్తున్నారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటికి కమిషనర్ కొత్త. ఇక ఇంజనీర్లు కొత్త. శానిటరీ ఇన్స్పెక్టర్లు ఇద్దరు ఉంటే ఒకరికి బాధ్యతలు అప్పగించలేదు. ఆ శానిటరీ ఇన్స్పెక్టర్‌ను చేర్చుకున్నారు కానీ ఆయనకు ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదు.దాంతో పట్టణమంతా ఒకే శానిటరి ఇన్స్పెక్టర్ పర్యవేక్షించే పరిస్థితి చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి పట్టణంలో చెత్తలను తొలగించుటకు కొత్త ట్రాక్టర్లు ఉండేవి. కానీ అవి మరమ్మతులకు గురి కావటంతో కార్యాలయ ఆవరణలో కునుకు తీస్తున్నాయి. పట్టణంలో రోజు రోజుకు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారుతుంది.

అధికారుల్లో జవాబుదారి తనం ఎక్కడ?

శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో అధికారులు,సిబ్బంది కొత్త. గతంలో ఇక్కడ పని చేసిన కమిషనర్ పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే వారు. వాహనాలు మరమ్మత్తులకు గురికాగా మొదటి ప్రాధాన్యత ఇచ్చే వారు. ఇంజనీరింగ్ విభాగం స్పందించే వారు. అయితే ప్రస్తుతం అధికారుల్లో సమన్వయం లోపించింది. సమయస్ఫూర్తి లేదు. శానిటరీ ఇన్స్పెక్టర్ ఏమో రెండుమూడు రోజుల్లో మరమ్మతులు చేస్తామన్నారు.

ర్యాగింగ్ భూతాన్ని జయద్దాం : ఎస్పీ

తిరుపతి విద్య,అక్టోబర్ 25 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వర్సిటీలో విద్యార్థి సంక్షేమ మరియు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు ర్యాగింగ్ పట్ల జాగృతి కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బ రాయుడు మాట్లాడుతూ సీనియర్ జూనియర్ అయిన విద్యార్థినీ విద్యార్థులు ర్యాగింగ్ పట్ల జాగ్రత్తగా ఉండాలనీ,ముఖ్యంగా ర్యాగింగ్ అనేక జీవితాలను చిద్రం చేస్తుందనీ, దీనికి కఠినమైనటువంటి శిక్షలు ఉన్నాయన్నారు. అదే విధంగా డ్రగ్స్,సైబర్ క్రైమ్ వంటి వాటి పట్ల కూడా విద్యార్థులందరూ అవగాహనతో విద్యార్థి జీవితాన్ని సాగించి మంచి భవిష్యత్తును అందుకోవాలని తెలియజేశారు. ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ వర్సిటీలో అనేక ర్యాగింగ్ అవేర్నెస్ సైన్ బోర్డులను ఏర్పాటు చేయడమైనదనీ విద్యార్థులందరూ అవగాహన పెంచుకొని సహృద్భావంతో మెలుగుతూ ఉన్నత స్థానానికి ఎదగాలని చెప్పారు.వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ మనిషి జీవితంలో విద్యార్థి దశ చాలా అందమైన ముఖ్య దశ అనీ,సీనియర్ విద్యార్థి తాను విద్యాలయాలలో ప్రవేశించేటప్పుడు మొదట వారు ఎదుర్కొన్న మానసిక సంఘర్షణను గుర్తు చేసుకుని,మీ తర్వాత వచ్చినటువంటి జూనియర్ విద్యార్థులకు అలాంటి ఇబ్బందులు లేకుండా సోదర భావంతో వాళ్లకు మీరే పెద్దలుగా దిశ నిర్దేశం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య కేటి రామకృష్ణారెడ్డి,తిరుపతి డి.ఎస్.పి వెంకటనారాయణ,ఆచార్య మురళీధర్, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డా.హరికృష్ణ యాదవ్ వర్సిటీ సిఐ ఎస్సైలు రామయ్య,వెంకట కిశోర్, అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు,పరిశోధకులు,విద్యార్థిని విద్యార్థులు,పోలీస్ సిబ్బంది వర్సిటీ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయం కన్నా... పాడి పరిశ్రమే మిన్నా

-పశుసంవర్ధకశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.ఎం.నాయక్ -జిల్లాలో పశు గణన పక్కాగా జరగాలి
-అఖిల భారత పశుగణనలో కలెక్టర్

పశు గణన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, మత్స్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.ఎం.నాయక్

తిరుపతిరూరల్, అక్టోబర్25 ప్రభాతవార్త: దైనందిన జీవితంలో పాడి పశువులు, పెంపుడు జంతువులు భాగస్వామ్యమైనాయని...భవిష్యత్‌లో వ్యవసాయం కన్నా... పాడి పరిశ్రమ ద్వారానే అధిక లాభాలు గడిస్తారని పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ, మత్స్యశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ తెలిపారు. 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమం-2021లో కార్యక్రమాన్ని శుక్రవారం తిరుపతిరూరల్ మండలం చిగురువాడ గ్రామ పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపురంలో ప్రారంభించారు. పశు గణన కార్యక్రమాన్ని ఈనెల 25వ తేదీ నుండి 2025 ఫిబ్రవరి 28వరకు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రిన్సిపల్ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయం ఎంత ముఖ్యమో పశు సంపద కూడా అంతే ముఖ్యమని....అందుకే పాడి-పంట అని అంటారని తెలిపారు. పాడి పశువులు, పెంపుడు జంతువులు మన జీవితంలో భాగమైనాయని తెలిపారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న పశు గణనలో 16 రకాల జంతువులను గణన చేయనున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 14వేల మంది పశు సంవర్ధక శాఖ సిబ్బంది ఉన్నారని, ఈ సర్వేలో రాష్ట్ర వ్యాప్తంగా 5500 మంది ఎన్యుమరేటర్లు, 1200మంది సూపర్ వైజర్లు పాల్గొంటున్నారని తెలిపారు. గత పశుగణన కన్నా పాడి పశువుల శాతం పెరిగిందని తెలిపారు. పశు గణన పక్కాగా పటిష్టంగా జరగాలన్నారు. రాష్ట్ర పశు సంవర్ధకశాఖ ప్రణాళికలు రూపొందించుకోవటానికి ఈ పశు గణనన ఎంతగానో ఉపయోగపడుతు ందని తెలిపారు. పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా క్యాలెండర్ టైం లైన్ మేరకు పక్కాగా వ్యాక్సినేషన్ చేయాలన్నారు. ఆరోగ్యకరమైన పశుసంపద సమాజానికి ఎంతో అవసరమన్నారు. పాడి రైతులకు అవసరమైన అన్ని సేవలు ఎప్పటి కప్పుడు గ్రామాల్లో అందుబాటులో ఉంచాల న్నారు. పశువుల కత్రిమ గర్భాధారణకు సీమెన్ అందుబాటులో ఉన్నదని, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. డీ-వార్మింగ్ పక్కాగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం పశు అభ్రీద్దికి కట్టుబడి ఉందని, పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ పశు గణనన వచ్చే విషయ సేకరణదారుడికి పాడి రైతులు సమగ్ర సమాచారాన్ని అందించాలని సూచించారు. సమగ్ర పశు గణనన ప్రభుత్వ పథకాల రూపకల్పనకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబంలో ఉన్న ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, పౌల్ట్రీ తదితర పశు సంపదకు సంబంధించిన వివరాలను సేకరించటానికి ఎన్యుమరేటర్ వస్తారని, వివరాల సేకరణ అనంతరం సదరు ఇంటి గోడపై స్టికర్ మార్కింగ్ చేయడం జరుగుతుందని తెలిపారు. వీధిలో తిరుగుతున్న పశువులు, కుక్కలు తదితర పశువుల వివరాలను సేకరణ కూడా జరుగుతుందని తెలిపారు. ఈ సర్వే కొరకు జిల్లాలో 472 మంది ఎన్యుమరేటర్స్‌ను 77మంది నియమించినట్లు తెలిపారు. ఎస్వీ వెటర్నరీ వర్శిటీ వి.సి.రవికుమార్ మాట్లాడుతూ పశు గణనకు ప్రతి ఇంటికి వచ్చే ఎన్యుమరేటర్ పెంపుడు జంతువులు, కోళ్ళు, గేదెలు, ఆవులు తదితర వివరాలను పూర్తి సమాచారాన్ని సేకరిస్తారని తెలిపారు. చిగురువాడ ఎంపిటిసి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పాడి రైతుల ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. గోమాతను గో-సంపదను సంరక్షించుకోవడం మన బాధ్యత అని తెలిపారు. కనుమరుగైతున్న గోవుల సంరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే పాడి రైతులకు ప్రోత్సాహక పథకాలు అందించి, పాడి రైతుకు లాభార్జన దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆధ్వర్యంలో తిరుపతిరూరల్ మండలంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నారని తెలిపారు. అనంతరం ఎన్యుమరేషన్ కరదీపిక, వివరాల సేకరణ, ఐడి కార్డులను, పోస్టర్లను, కర పత్రాలను, కిట్ బ్యాగ్‌లను ఆవిష్కరించారు.

ప్రజల నుంచి అర్జీలు సకాలంలో పరిష్కరించండి

- క్షేత్రస్థాయిలో తిరిగి సమస్యలు లేకుండా చూడాలి- హౌసింగ్ పట్టాల మంజూరుకు సర్వే చేపట్టాలి
-సమయ పాలన ఖచ్చితంగా పాటించాలి !! - జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త : జిల్లాలో సీనియర్ అధికారులు ఉన్నారు.. క్షేత్రస్థాయిలో తిరిగి ప్రజలనుంచి వచ్చిన సమస్యలను పరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించాలని మరలా అర్జీలు రిపీట్ చేయించవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం(పిజిఆర్ఎస్) నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ నేరుగా ప్రజలనుంచి 83 అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో అధికారులు సమయ పాలన ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ప్రజలనుంచి వచ్చిన అర్జీల పరిష్కారానికి తగు సమయం కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా సుమారు పదివేల అర్జీలు వచ్చాయన్నారు. వీటిని శాఖల వారీగా కేటాయించడం జరుగుతుందన్నారు. అధికారులు సమస్యల పరిష్కారంకై చొరవ చూపి అవి ఏ దశలో ఉన్నాయో ప్రజలకు ఎండార్స్‌మెంట్ ఇస్తే ప్రజలకు కూడా తెలుస్తుందన్నారు. అర్హులైన పేదలకు హౌసింగ్ పట్టాల మంజూరుకు సర్వే చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఫ్రీ హోల్డ్ వెరిఫికేషన్ పనులు చేపట్టాలన్నారు. రెవెన్యూ మ్యూటేషన్‌పై సైతం వినతులు వస్తున్నాయని ఈ పనులు త్వరగా చేయాలని ఆదేశించారు. ఇకపై ఏ సమస్యపైన ప్రజలనుంచి అర్జీలు వచ్చినా ఎప్పటినుంచి అర్జీలు ఇస్తున్నారని తానే నేరుగా ప్రజలను అడుగుతానని పేర్కొన్నారు. ప్రతి అర్జీని ఆడిట్ చేస్తామన్నారు. అర్జీదారులతో కొంతమందికి నేరుగా ఫోన్ చేసి సమస్యల పరిష్కారంపై స్పందన తెలుసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో పరిష్కరించే అర్జీలను జిల్లా కార్యాలయాలకు పంపితే పరిశీలించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఎపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, జడ్పీ సిఇఒ రవికుమార్ నాయుడు, హౌసింగ్ పిడి పద్మనాభం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు, అధికారులు పాల్గొన్నారు.

మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు

-ప్రసూతి మరణాలకు బాధ్యులుగా నిర్ధారణ అయితే చర్యలు తప్పవు -జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్

ప్రసూతి మరణాలపై జరిగిన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త : ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో మాతృ, శిశు మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రసూతి మరణాలకు బాధ్యులుగా నిర్ధారణ అయితే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో జూన్ 2024 నుండి సెప్టెంబర్ 24 వరకు జరిగిన ప్రసూతి మరణాలపై సంబంధిత కుటుంబ సభ్యులతో చికిత్స అందించిన డాక్టర్లు, అంగన్‌వాడి, ఎఎన్ఎం ఆశాలతో జిల్లా కలెక్టర్, మెటర్నల్ డెత్ సర్వేలన్స్ రెస్పాన్స్ కమిటి అధ్యక్షులు డా. ఎస్. వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఆడిట్ నిర్వహణ జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా ప్రసవ సమయంలో నియమావళి మేరకు వైద్య పరీక్షలు జరిపి తల్లి, బిడ్డ క్షేమానికి ప్రాధాన్యత నివ్వాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరగే మాతృ మరణాలపై సంబంధిత బంధువులు వివరణ పరిగణలోకి తీసుకుంటామని, నిర్లక్ష్యం వహించిన వారిపై తప్పనిసరి చర్యలు ఉంటాయని అన్నారు. గర్భవతి నుండి ఆమె ఆరోగ్యం కోసం అంగన్వాడి పోషాహారం అందించడం, ఎఎన్ఎం ప్రతినెల ఆసుపత్రి తీసుకువెళ్ళి పరీక్షలు నిర్వహించి అనీమియా వంటివి లేకుండా చూడటం, ఆశాలు వారు సరైన సమయానికి చికిత్స పొందుతున్నారా లేదా చూడాలని అన్నారు. ఒక మరణం జరిగితే ఆశా నుండి ప్రసవ సమయానికి చికిత్స పొందుతున్నారా లేదా చూడాలని అన్నారు. ఒక మరణం జరిగితే ఆశా నుండి ప్రసవ సమయంలో వున్న డాక్టర్ వరకు బాధ్యత వహించాల్సి ఉంటుందని నిర్లక్ష్యంకు తావు ఇవ్వరాదని ఇది వారి ప్రాణానికి సంబంధించిన అంశం అనేది గుర్తుంచుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలు, గిరిజన ప్రాంతాలు, అక్షరాస్యత తక్కువ ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అంగన్వాడి, మహిళా పోలీస్, ఆశాలు తదితరులు చైతన్య వంతులను చేయాలన్నారు. ఈ సమీక్షలో డిసిహెచ్ఎస్ ఆనందమూర్తి, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని జయలక్ష్మి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి శాంత కుమారి, అదనపు డిఎంహెచ్ఓ శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ పార్థసారథి రెడ్డి, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

బిడ్డల్లాంటి మామిడితోటలను...
వ్యాపారుల చేత్లులో పెట్టొద్దు!

-జిల్లా హార్టికల్చర్ అధికారి మధుసూదనరెడ్డి

సబ్‌డివిజన్ రైతుసేవా సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న మధుసూదనరెడ్డి

పుంగనూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త : మామిడిని ఈ సీజన్‌నుంచే పసిబిడ్డలా కాపాడాలని, వ్యాపారస్తులకు తోటలను అప్పగిస్తే, పరాయి ఇండ్లలో మనబిడ్డల పరిస్థితిలా మామిడిచెట్ల పరిస్థితి తయారౌతుందని,రైతులు తమకు ఎంత అవగాహన ఉన్నప్పటికీ, వ్యవసాయశాస్త్రవేత్తల సూచనలు పాటించి మంచి దిగుబడి సాధించాలని జిల్లా హార్టికల్చర్‌అధికారి డి.మధుసూదనరెడ్డి విజ్ఞప్తిచేశారు. శుక్రవారం స్థానిక మండలపరిషత్తు కార్యాలయంలో సబ్‌డివిజన్‌లోని ఎనిమిది మండలాల రైతు సేవా సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. మదనపల్లి వ్యవసాయశాస్త్రవేత్త బాలహుసేని,చిత్తూరు వ్యవసాయ డిడి విజయశంకర్‌రెడ్డిలు పాల్గొన్న ఈశిబిరంలో మధుసూదనరెడ్డి మాట్లాడుతూ రైతులకు ఒకప్పుడు మామిడి పంటల దిగుబడి చాలా అధికాంగా ఉండేదని, మంచి లాభసాటిగా ఉండేదన్నారు. అయితే, రైతులు తమ బిడ్డల్లాంటి తోటలను ఎప్పటినుంచే అయితే అమ్మడం ప్రారంభించాలో అప్పటినుంచి పరాయి వ్యక్తుల చేతుల్లో మనబిడ్డల పరిస్థితిలా మామిడి పంటల పరిస్థితి తయారైందన్నారు.

అంటే,పూతనుంచి పిందెవరకు మనకు తెలిసినట్లుగా సస్యరక్షణ వ్యాపారులకు తెలియకపోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ఈపరిస్థితి ఎదురవుతున్న దన్నారు. సకాలంలో కొమ్మలు తొలగించడం, పోషకాలు అందించడం, తేనె మంచు పురుగులు పట్టకుండా చర్యలు చేపట్టడం, మందుల పిచికారి వల్ల మంచి పంటలు సాధించవచ్చని, రైతులను నేరుగా ఎఫ్‌పిఓలకు అనుసంధానం చేస్తే, నేరుగా మామిడి విక్రయించి రైతుల ఆదాయం పెంచవచ్చన్నారు. పూతదట్టంగా రావాలంటే డిసెంబర్ తొలివారంలో బోరాన్‌మల్టీ కే మిశ్రమాన్ని పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి 5 లక్షలు విరాళం

కాణిపాకం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు శుక్రవారం 5 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు కడపకు చెందిన గజ్జల దినేష్‌రెడ్డి అనే భక్తుడు నిత్యాన్నదానంకు 5 లక్షల రూపాయ లను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా న్ని దాతలు ఆలయ ఏఈఓ రవీంద్రబాబుకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, టెంపుల్ ఇన స్పెక్టర్ రవి, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వివాహిత మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఐరాల, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మండలంలోని బెస్తపల్లెకు చెందిన వివాహిత మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై నరసింహులు తెలిపారు. వివరాలిలావున్నాయి.బెస్తపల్లెకు చెందిన దేవేంద్ర భార్య శిరీష(24) అనే మహిళ ఈనెల 21న ఇంటి నుండి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి పురుషోత్తం శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరసింహులు తెలిపారు.

గణనాధుని సన్నిధిలో నందమూరి రామకృష్ణ

కాణిపాకం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: మాజీ సీఎం దివంగత ఎన్టీఆర్ తనయుడు నందమూరి రామకృష్ణ శుక్ర వారం రాత్రి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యా దలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆయన వెంట స్థానిక టీడీపీనాయకులు నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం.. పరిశుభ్రత అందరి బాధ్యత

– ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త : సమాజంలో పచ్చదనం పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్మెల్సీ, సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం కుప్పం పట్టణం పరిధిలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు అధ్వర్యంలో డివైడర్లలో మొక్కలు నాటే కార్యక్రమం కార్యక్రమాన్ని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌తో కలసి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి కన్నతల్లి లాంటిదన్నారు. ప్రకృతిని కాపాడుకోవడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, కౌన్సిలర్లుసోమశేఖర్,సురేష్,నేతలు డా॥ వెంకటేష్, ఆర్ముగం, జనసేన నరేష్, వాటర్ గిరి పాల్గొన్నారు.

దేశానికి ముత్తు రామలింగదేవర్ సేవలు మరువలేనివి

– ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

కుప్పం, అక్టోబర్ 25 ప్రభాతవార్త : దేశానికి స్వాతం త్ర్య సమర యోధుడు ముత్తురామ లింగ దేవర్ చేసిన సేవలు మరువలే నివని ఎపిఎస్ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పి ఎస్ మునిరత్నం పేర్కొన్నా రు. శుక్రవారం స్థానిక అం బికా కళ్యాణ మండపంలో దేవర్ జయంతి వేడుకలు ఘన ంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవర్ ఆధ్యాత్మిక నాయకుడిగా ముకులాథోర్ సమాజంలో దేవతగా చూడబడ్డారన్నారు. ఆయనకు నేటికీ ప్రజలు నైవేద్యం సమర్పిస్తారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ సన్నిహితుడుగా దేవర్ కొనసాగారన్నారు. 1952నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ డిప్యూటీ ఛైర్మన్‌గా పనిచేశారన్నారు. 600 ఎకరాల భూములను పేదలకు పంచిన మహనీయుడు దేవర్ అని కొనియాడారు. అనంతరం దేవర్ చిత్రపటానికి వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్‌లు పూజలు చేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర దేవర సంఘం అధ్యక్షులు ఈశ్వర్‌దేవర్, తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి మరియు రాష్ట్ర దేవర్ సంఘం ఉపాధ్యక్షులు శివాదేవర్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ

ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం

పాలసముద్రం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: సమస్యలపై వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిం చాలని ఎంపిడిఓ మహేష్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎంపిడిఓ మహేష్‌రెడ్డి శుక్రవారం మం డల పరిధిలోని నరసింహపురం, తిరుమలరా జపురం సచివాలయాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సంద ర్భంగా సచివాలయ సిబ్బందితో ఎంపిడిఓ మాట్లాడు తూ గ్రామాల్లో డ్రాప్ అవుట్ పిల్లలను గుర్తించి వారు మళ్ళి బడికి వెళ్ళేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎదైనా సమస్యలు వుంటే తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని, విధుల నిర్వహణలో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం గ్రామ సచివాలయ పరిధిలోని పాఠశాలను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్డీ రమేష్‌బాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రీ-సర్వేలో తప్పులు వుంటే పరిష్కరిస్తాం

పాలసముద్రం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: గత ప్రభు త్వ హయాంలో జరిగిన భూముల రీ-సర్వే కార్యక్ర మంలో తప్పులు ఎదైనా జరిగి వుంటే రైతులు పరిష్క రించుకోవడానికి ప్రస్తుత ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందని తహసిల్దారు అరుణకుమార్ అన్నారు. పాలసముద్రం పంచాయతీ మఠవలం గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామ సభలో తహసిల్దారు అరుణకుమారి పాల్గొని మాట్లాడుతూ రీ-సర్వేలో ఎదైనా తప్పులు జరిగి వుంటే గ్రామ సభలో అర్జీలు ఇస్తే వాటిని అధికారులు పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ గ్రామసభలో రైతుల నుండి రీ-సర్వేకు సంబంధించి మూడు ఫిర్యాదులు అందాయి. వీటిని పరిశీలించి పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని సర్వేయర్, విఆర్ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, విఆర్ఓలు, గ్రామ సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందించిన ఎస్పీ

చిత్తూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లా పోలీసు శాఖలో హోంగార్డులుగా విధులు నిర్వహిస్తున్న 18 మంది హోంగార్డుల పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్పులను శుక్రవారం ఎస్పీ మణికంఠ చందోలు వారికి అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థు లను విద్యలో ప్రోత్సహం కల్పించడం, వారి భవిష్యత్తు పురోగతికి సహకరించడం ప్రధాన లక్ష్యం అవుతుందన్నారు. హోమ్ గార్డు తమ పిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దడానికి కలలు కంటుంటారని, వారి పిల్లలు విద్యాభాసంకు పోలీసు శాఖ పునాది వేయడం సంతోషం కల్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఎఎస్పీ ఆర్.శివానందకిషోర్, ఏఆర్ డిఎస్పీ మహబూబ్‌భాషా, ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ భాస్కర్, అడ్మిన్ ఆర్ఐ సుధాకర్, ఎంటిఓ ఆర్ఐ భాస్కర్, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

గుంతల పూడ్చివేత

పుంగనూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త : పట్టణం లోని ఆర్టీసి బస్టాండు మినీబైపాస్ రోడ్డువద్ద వర్షం నీటితో గుంతల మయమైన రోడ్డు మరమ్మతుకు విశ్రాంత డిఎస్పీ కనుమకుంట సుకుమార్ ముందుకు రావడంతో సమస్య పరిష్కారమైంది. ఇటీవల నిరవది కంగా కురిసిన వర్షాలతో ఆర్టీసి బస్టాండు వద్ద రోడ్డు వర్షపు నీటితో నిండిపోయి తీవ్ర ఆటంకం ఎదురైంది. ఈసమస్య జటిలం కావడంతో పాటూ అధికారులు,నాయకులు పరిష్కరించలేకపోగా, మున్సిపల్ అధికారులు సైతం మిన్నకుండిపోయారు. పత్రికలలో ఈవిషయం తెలుసుకున్న విశ్రాంత డిఎస్పీ కనుమకుంట సుకుమార్‌బాబు తక్షణం స్పందిం చారు. బస్టాండు ప్రాంతం వద్ద నీటి నిల్వలను తొలగింపచేసి,గుంతలను కంకర,సిమెంటుతో పూడ్చి వేయించారు. ఆయన మాట్లాడుతూ పదిమందికి సాయపడాలని, సమాజానికి ఎల్లపుడూ అందుబాటులో ఉండాలని,ఎన్నికల సమయంలో మాత్రమే సేవలు చేసే నాయకులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఆర్‌జెబి భరత్‌భూషణ్,సత్య,దేశాదిశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అధ్వర్యంలో రక్తదాన శిబిరం

వి.కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

వి.కోట పట్టణంలో పోలీసుల అధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రభుత్వాస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు పోలీసులు, యువత రక్తదానం చేశారు. కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

గంగా భవాన్నీకి రాహుకాలాభిషేకం

బోయకొండ(చౌడేపల్లి), అక్టోబర్ 25 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు రాహుకాలా భిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణగావించారు. రాహుకాల సమయంలో దంపతుల సమక్షంలో అర్చకుల ఆధ్వర్యంలో జరిగిన అభిషేకం భక్తులను అలరించింది. అనంతరం పాత కళ్యాణకట్ట భవనంలో అన్నదాన శిబిరాన్ని ఏర్పాటు చేసారు. అన్నదానానికి పలమనేరుకు చెందిన నవీన్ అతని మిత్రబృందం కూరగాయలను విరాళంగా అందించారు. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం, అధికార, అర్చక, సిబ్బంది సేవలందించారు.

క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్ళాలి : గువ్వల

చౌడేపల్లి,అక్టోబర్25ప్రభాతవార్త : విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో ముందుకు వెళ్ళాలని మండల తేదేపా అధ్య క్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. స్థానిక ఉన్న తపాఠశాలలో ఇటీవల ఎంపికయిన అండర్-17 జిల్లా బాలబాలిక కబడ్డీజట్టు క్రీడాకారులకు అభినందన సభ ఏర్పాటు చేసారు. గెలుపోటములు క్రీడల్లో సహజ మనీ, గెలుపనేది ప్రారంభం కాదనీ, అదే ఓటమి అంతం కాదన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే జిల్లా జట్టుకు ఉన్నతపాఠశాల నుంచి ఎంపికయిన సుమతి, అపర్ణ, హేమలత, శివకేశవలకు అభినందనలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే అండర్-17బాలబాలికల జిల్లాజట్టు ఎంపిక కోసం స్థానిక ఉన్నతపాఠశాల వేదికయ్యేలా కృషి చేసిన గువ్వల రమేష్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు నాగరాజరెడ్డి, మాజీ ఎంపిటీసీ వెంకట్రమణ, సుధాకర్‌రెడ్డి, చిన్ని, సుదర్శన్‌రెడ్డి, ఉపాధ్యాయులు మురళి, రాజేంద్ర, ఈశ్వర్, సుధాకర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ జట్టుకు రహమాన్‌ఖాన్

బంగారుపాళ్యం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయ వాలీబాల్ జట్టుకు బంగారుపాళ్యంకు చెందిన దావూద్‌ఖాన్ కుమారుడు అబ్దుర్ రహమాన్‌ఖాన్ ఎంపికయ్యాడు. గత మూడు రోజుల క్రితం శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలో జరిగిన స్కూల్ గేమ్స్ నందు జిల్లా జట్టు తరపున రహెమాన్ ఖాన్ విశేష ఆట ప్రతిభ కనబరిచాడు. జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది. ఇందులో భాగంగా జాతీయ స్థాయికి ఎంపిక చేసిన జట్టులో బంగారుపాళ్యంకు చెందిన రహమాన్ ఖాన్ ఎంపిక కావడం పట్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సిరాజ్, సుదర్శన్‌నాయుడు, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు కుమార్‌రాజా, కృష్ణమూర్తిలు అభినందించారు.

ఎమ్మెల్యేచే పశుగణన ప్రారంభం

బంగారుపాళ్యం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: జాతీయ పశు గణనను పశుసంవర్ధక శాఖ అధికారులు శుక్ర వారం చేపట్టారు. నలగాంపల్లి నందు ఈకార్యక్రమం ను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీ మోహన్ ప్రారంభించారు. అంతకు మందు గోపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భం గా పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్ మాట్లా డుతూ జాతీయ స్థాయిలో పశుగణన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టాయన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ నెలాఖరు వరకు జరుగుతుందని ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి ఎన్యుమరేటర్లు వెళ్ళి పశుగణన చేపడు తారని తెలిపారు.డిడి ఆరీఫ్, ఎడి ఆసీఫ్, మండల టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు జయప్రకాష్, జనార్ధన గౌడు, టిడిపి నాయకులు జయచంద్రనాయుడు, హేమచంద్ర, నాగరాజు, కోకా ప్రకాష్, చిన్నయ్య, కృష్ణకుమారి, రాధిక, రాధాకృష్ణ, రమేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆటోల దొంగలు అరెస్ట్!

వి.కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త : ఆటోలు దొంగతనాలు చేసి తమిళనాడు రాష్ట్రంలో తక్కువ ధరలకు విక్రయించే ముఠాను వి.కోట పోలీసులు అరెస్ట్ చేశారు. వీరినుంచి సుమారు పది లక్షల విలువ చేసే 6 ఆటోలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. వి.కోటకు చెందిన నలుగురు యువకులు ఆరు ఆటోలు చోరీ చేసి వాటిలో నాలుగు ఆటోలను తమిళనాడులో తక్కువ ధరలకు విక్రయించారు. మరో రెండు ఆటోలను తమ వద్దే ఉంచుకున్నారు. ఆటోల చోరీపై పోలీసులకు అనుమానం వచ్చి వారిని విచారించగా చోరీ విషయం బయటపడింది. దీంతో తమిళనాడుకు వెళ్లి అక్కడనుంచి నాలుగు ఆటోలు స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అరెస్ట్ చేశామన్నారు.

గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ విజతకు సన్మానం

వెంకటగిరిరూరల్ అక్టోబర్ 25 ప్రభాతవార్త:

తిరుపతి జిల్లాలో వెంకటగిరిలోని మహాత్మాజ్యోత బాపూలే గురుకుల (బిసీ)పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి ఎస్‌కె అబ్దుల్ ఇటీవల రాష్ట్ర స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీలో విజయం సా దించి గురుకుల పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యా తులు తీసుకోని వచ్చినట్లు వెంకటగిరిలోని మహాత్మా జ్యోతబాపూలే గురుకుల (బిసీ) పాఠశాల ప్రిన్సిపాల్ జెవివి పాండురంగరావు పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.వైస్ ప్రిన్సిపాల్ మంగలపూరి పరంధామయ్య,సిబ్బంది సుజాత తదితరులు పాల్గొన్నారు.

జననివాసాల మధ్య మద్యం షాపులను తొలగించాలి

కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

కోట మండలంలో జన నివాసాల మధ్య మద్యం షాపులను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ కోట పంచాయతీ పరిధిలో నాలుగు షాపులను ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రతి షాపుకు వ్యాపార కూడళ్లు, బస్టాపులు, కల్యాణ మండపాలు, హాస్పిటల్‌కు చేరువలో ఏర్పాటు చేశారని అన్నారు. దాదరాయగుంట వద్ద ఏర్పాటు చేసిన షాపుకు కొక్కుపాడు, తిమ్మానాయుడుపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు వేచి ఉండే ఆటో స్టాండ్, నివాస గృహాలు, సచివాలయ సముదాయం ఉందన్నారు. నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి బొమ్మ వద్ద ఏర్పాటు చేసిన షాపు పక్కనే లక్ష్మీనారాయణ హాస్పిటల్, చిన్నపిల్లల హాస్పిటల్, రెడ్డిసంఘ భవన్, సూపర్ మార్కెట్ ఉండటం వల్ల ప్రజల రాకపోకలు ఉంటాయన్నారు. కోట క్రాస్‌రోడ్డులో గూడూరు, నాయుడుపేట, వాకాడు తదితర ప్రాంతాలకు రాకపోకలు చేసే ప్రజలకు కూడలిలో వంద మీటర్లు లోపే రెండు బ్రాందీషాపులు ఉన్నాయన్నారు. వివిధ విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు విద్యార్థులు, ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. ఈ నాలుగు మద్యం దుకాణాలను ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్నారని ఆరోపించారు. ఈ షాపుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. అధికారులు నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్న షాపులపై చర్యలు తీసుకోవాలని ఆ దుకాణాలకు లైసెన్సులు మంజూరు చేయకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

వాసిరెడ్డి పద్మా.. ఆత్మ విమర్శ చేసుకో

కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

వైసీపీ పాలనలో మహిళా ఛైర్మన్‌గా పనిచేసిన వాసిరెడ్డి పద్మ ఒక్కసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని గూడూరు నియోజకవర్గం వైసీపీ యువత అధ్యక్షుడు చిల్ల కూరు సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విద్యానగర్‌లో విలేఖరులతో మాట్లాడుతూ వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో అన్నీ పదవులు పొంది.. నేడు తన స్వార్థ రాజకీయాల కోసం వైసీపీని వీడిపోవడం మంచిది కాదన్నారు. ఆమె పార్టీని వీడిన అనంతరం పార్టీపై బురదజల్లడం మంచిది కాదన్నారు.

కావలిమిట్టకు మంచినీటి సరఫరా

తడ, అక్టోబర్ 25 ప్రభాతవార్త : తడ మండలం పెరియవట్టు పంచాయతీ పరిధిలోని కావలిమిట్టకు మంచినీటి సరఫరా పునరుద్ధరించారు. గత మూడు రోజులుగా అక్కడ నీటి కొరత ఏర్పడింది. దీనితో గ్రామస్థులు ఎంపిడిఓ విజయకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన స్పందించి పంచాయతీ కార్యదర్శి, సర్పంచ్‌లతో మాట్లాడి పైపులైన్ ద్వారా కొళాయిలకు నీటిని రప్పించే చర్యలు తీసుకున్నారు.

భూ సమస్యలు పరిష్కరించడానికి గ్రామ సభలు

వెంకటగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవె న్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు 14 వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రీ సర్వే జరిగిన గ్రామాలకు గ్రామ సభలు నిర్వహించమని చెప్పడం జరిగిందని తెలిపారు. పొలాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉంటే తెలిపితే పరిష్కరిస్తారని తెలిపారు. భూ సమస్యలపై స్థానికులు పలు ఫిర్యాదులు చేశారు.

జిందాల్ ఫౌండేషన్‌చే టైలరింగ్ శిక్షణ

చిల్లకూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

చిల్లకూరు మండలంలోని లింగవరం గ్రామ పంచా యితీలో ఏర్పాటై ఉన్న జిందాల్ పవర్ లిమిటెడ్ సింహపురి యూనిట్, జిందాల్ ఫౌండేషన్, సామాజిక బాధ్యత కార్యక్రమాల (సిఎస్ఆర్) కింద నిర్వహించిన మహిళా సాధికారత, నైపుణ్య అభివృద్ధి ప్రాజెక్ట్‌లో భాగంగా, టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని హెడ్ ఆఫ్ ప్లాంట్ కె.శ్రీనివాస్ రావు చేతుల మీదుగా ప్రారంభించారు. శిక్షణ కోసం 15 టైలరింగ్ యంత్రాల ద్వారా పరిసర గ్రామ పంచాయితీలైన తమ్మినపట్నం, లింగవరం, వరగలి, మొమిడి నుండి వచ్చిన మహిళలకు శిక్షణ అందించనున్నారు. మొత్తం 40 మంది మహిళలు ఈ శిక్షణకు లబ్ధిదారులు కాగా, 45 రోజుల పాటు రోజూ రెండు బ్యాచులుగా శిక్షణ కొనసాగుతుందన్నారు. జిందాల్ కంపెనీ ఉద్యోగులు హెచ్ఆర్, హెచ్ఓడి విల్సన్, సిఎస్ఆర్ జోబిన్ మ్యాథిఫ్, హెచ్ఓడి క్వాలిటీ శ్రీకాంత్, లైజనింగ్ ఎస్‌కె కలిద్, జెఎస్‌పి ఫౌండేషన్, సిఎస్ఆర్ బృందం పాల్గొన్నారు.

పశుగణన కార్యక్రమం నిర్వహణ పై సమీక్ష

గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

21వ అఖిలభారత పశుగణన ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం కార్యదర్శికంగా నిర్వహించాలని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పశు సం వర్ధక శాఖ అధికారులు 21వ అఖిలభారత పశుగణన కార్యక్రమంలో వినియోగించే కిట్లను ఎమ్మెల్యే సునీల్ కుమార్ పవు సంవర్ధక శాఖ అధికారులు సిబ్బందికి అందజేసి పోస్టర్లను విడుదల చేశారు. గూడూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ పశు సంవర్ధక శాఖ అధికారులతో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం నిర్మాణపై సమీక్షించారు.వచ్చిన గణాంకాల ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశువుల సంరక్షణకు, వాటి పోషణకు అవసరమైన ప్రణాళికలను రూపొందించి అమలు చేయడానికి వీలవుతుందని తెలిపారు.

వైసిపి నాయకుడు వ్యాఖాలను ఖండిస్తున్నాం : ఎమ్మెల్యే

గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

పారిశ్రామికవేత్త సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయ కుడు గాంగాప్రసాద్ పై సూళ్లూరుపేట నియోజకవర్గం పెళ్లకూరు మండలానికి చెందిన మాజీ జడ్పిటిసి, వైసిపి సీనియర్ నాయకుడు సత్య నారాయణ రెడ్డి చేసిన అసభ్యకర వాఖ్యాలను తీవ్రంగా ఖండిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ టిడిపి నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్యనారాయణరెడ్డి జీవితం ఎలాంటిదో మాకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర రాజు, పులిమి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు చిల్లకూరు పట్టాభిరామ్ రెడ్డి, అబ్దుల్ రహీం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులకు చోటు కల్పించడం అభినందనీయం

గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన కూటమి ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన విషయాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడమైందని అందులో ముఖ్యంగా స్థానిక దేవాలయ కమిటీలలో సభ్యులుగా బ్రాహ్మణులకు చోటు కల్పిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రి వర్గ సభ్యులు నిర్ణయం తీసుకోవడమైందన్నారు. ఈ విషయం చాలా సంతోషదాయకమైందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవ అధ్యక్షుడు శ్రీకంటి రామమోహన్ రావు, ప్రెసిడెంట్ ప్రసాద్, కార్యదర్శి నరేష్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రావణ్ కుమార్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ధర్నా

గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త : ఏపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్, సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు శుక్రవారం మధ్యాహ్నం గూడూరు మున్సిపాలిటీ పరిధిలోని ఆరు మస్టర్ పాయింట్లలో గూడూరు మున్సిపల్ సంఘం పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వర రావు ఆధ్వర్యంలో కార్మికులు దీర్ఘకాలికంగా ఉన్న పలు సమస్యలపై ధర్నా జయప్రదం చేసారు. అలాగే సోమవారం 28వ తేదీ జరగబోయేటటు వంటి మున్సిపల్ ఆఫీసుల వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జోగి శివకుమార్, పి.శ్

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి : టిటిడి జెఈఓ

తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్త: సోమవారం జరిగే టిటిడి ఉద్యోగుల బ్యాంకు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలని, ఎన్నికలకు ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, అవసరమైన చర్యలు తీసుకోవాలని టిటిడి జెఈఓ గౌతమి ఆదేశించారు. ఉద్యోగులు తిరుపతిలోని ఎస్వీ హైస్కూల్, ఎస్జిఎస్ హైస్కూల్, ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఉద్యోగి గుర్తింపుకార్డుతో రావాలన్నారు.

తిరుమలలో ప్రతి గజం వెంకన్నదే

తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి: గత ఐదేళ్ళలో రాష్ట్రం లోని వైసిపి ప్రభుత్వం పెద్దలు, అప్పటి టిటిడి పాలక మండళ్ళు ఏకంగా విశాఖశారదాపీఠంకు చెందిన మఠానికి అదనంగా స్థలాలు కేటాయించింది. అంతేగాక బహుళఅంస్థుల భవనాలను నిర్మించుకునేందుకు కూడా టిటిడి అంగీకరించింది. ఇప్పుడుఈ భవనాలను నిర్మించిన స్థలాలను తిరిగి టిటిడి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఈ శారదామఠంకు కేటాయించిన స్థలాల ఉత్తర్వులు రద్దుచేసింది. ఈ నేపథ్యంలో అక్రమకట్టడాలను కూల్చివేయాలని, ప్రతి గజం దేవదేవుడు వెంకన్నదేనని శుక్రవారం తిరుపతికి చెందిన జనసేన ఇన్ఛార్జి కిరణ్‌రాయల్, అనుచరులు రాజారెడ్డి, హరి,మనోజ్,కిశోర్‌మఠం వద్దకు చేరుకుని దేవుని స్థలాన్ని దారాదత్తం చేయడాన్ని నిరసించారు.

విద్యార్థినులు పోలీసు చట్టాలపై అవగాహన ఉండాలి

తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్త: విద్యార్థినులు పోలీసు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, ఏదేని అత్యవసర సమయంలో 112కు ఫోన్‌చేస్తే పోలీసుల సహాయం అందుతుందని మహిళ హెడ్‌కానిస్టేబుల్ ఎన్‌సి శాంతమ్మ తెలిపారు. విద్యార్థినులకు శుక్రవారం ఉదయం దొడ్డాపురంవీధిలోని నగరపాలకసంస్థ ఉన్నతపాఠశాలలో 6వతరగతినుండి10వతరగతివిద్యార్థినులకుఅవగాహనసదస్సు ఈస్టుమహిళ రక్షక్ పోలీసులు నిర్వహించారు. ఈస్టు రక్షక్ పోలీసులు శ్రావణి, అంజమ్మ, నీరజ,పాఠశాల ఉపాధ్యాయునుల్లు పాల్గొన్నారు.

28న స్విమ్స్‌లో 3వ ఎండోమెంట్ చైర్ ఓరేషన్

తిరుపతి హెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త : స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగం వారి ఆధ్వర్యంలో 3వ శ్రీ సింహాద్రి సత్యనారాయణ రావు ఎండోమెంట్ చైర్ ఓరేషన్ ఈ నెల 28వ తేది సోమవారం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ప్రొఫెసర్ ఆఫ్ అంకాలజీ డైరెక్టర్ ఎంఎస్‌జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ హైదరాబాద్ డా. ముక్తా శ్రీనివాసులుఓరియేటర్‌గావిచ్చేసి ఎవల్యూషన్ ఆఫ్ సర్జికల్ ఆంకాలజీ అనే అంశంపై ప్రసంగించనున్నారు. ముఖ్య అతిథిగా స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ పాల్గొంటారన్నారు.

ఎమ్మెల్యే ఆరణిని కలిసిన నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ సభ్యులు

తిరుపతి హెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త : తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను తిరుపతి ప్రెస్ క్లబ్ 2024-26 ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, ట్రెజరర్, ఉపాధ్యక్షులు, జాయింట్ కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు అందరూ కలిసికట్టుగా శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను నూతన కమిటీ కార్యవర్గం శాలువ కప్పి పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నూతన కార్యవర్గ అధ్యక్షులు మురళి, కార్యదర్శి బాలచంద్ర, ట్రెజరర్ చంద్రబాబు, ఉపాధ్యక్షులు లావణ్య కుమార్, జాయింట్ సెక్రెటరీలు విజయ్ యాదవ్, జగదీష్ అలాగే కార్యవర్గ సభ్యులు పరంధామరెడ్డి, జయశంకర్, కోటేశ్వరుడు, వరప్రసాద్ రావు తదితరులను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శాలువా, పుష్పగుచ్చాలతో ఘనంగా సత్కరించి అభినందించారు. అలాగే నూతన కార్యవర్గానికి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు.

వంగ,కాకర చెట్లను తొలగించిన అధికారులు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన పంట భూమిలో అక్రమంగా సాగు చేస్తున్న వంగ,కాకర చెట్లను దేవస్థానం అధికారులు శుక్రవారం తొలగించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి చుక్కల నిడిగల్లులో దేవస్థానంకు సంబంధించిన భూమిలో కొందరు అనుమతుల్లేకుండా సాగు చేసుకుంటున్నారు. ఈ అంశాన్ని తెలుసుకున్న దేవస్థానం అధికారులు శుక్రవారం స్పందించారు. ఈ భూమిలో వంగచెట్లు, కాకర నారు,కంచెను గురించి ఆలయాధికారులకు సమాచారం అందింది. దేవస్థానం అనుమతిల్లేకుండా ఎవరైనా భూములు ఆక్రమించుకుంటే దేవాదాయశాఖ చట్టం ప్రకారం సివిల్,క్రిమినల్ చర్యలు తీసుకోబడుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ హెచ్చరించారు.

ఎస్‌వి మార్టు ప్రారంభం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త : రోజు రోజుకు విస్తృతమౌతున్న శ్రీకాళహస్తి పట్టణ ప్రజల అవసరాలను తీర్చుటకు పెద్ద పరిశ్రమలు,వ్యాపార సంస్థలు వస్తున్నాయని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. పానగల్‌లో శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లికి చెందిన ఎన్ ఆర్ ఐ దేవ అనే యువకుడు ఏర్పాటు చేసిన ఎస్‌వి మార్టును శుక్రవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. శ్రీకాళహస్తిని కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్ళటానికి చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల్లో పని చేసే అధికారులు, ఉద్యోగుల అవసరాల దృష్ట్యా డిమార్టు,ఇతర పెద్ద వ్యాపార సంస్థలు ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో సువిశాలమైన ఆవరణలో ఎస్ వి మార్టును ఏర్పాటు చేయటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు దేవ స్వాగతం పలికారు. ఆయనతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ అధ్యక్షుడు రంగినేని చెంచయ్యనాయుడు,మాజీ పాలసరఫరా సంఘా ధ్యక్షుడు రావిళ్ళ మునిరాజానాయుడు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు,మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు తాటిపర్తి రవీంద్రరెడ్డి, ఢిల్లిబాబు, రాము,దుర్గా ప్రసాద్,కంఠారమేష్,జనార్ధన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఉపాధ్యాయునికి అరుదైన అవకాశం

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 25 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘీక శాస్త్రాన్ని బోధిస్తున్న జాతీయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌కు న్యూఢిల్లిలోని జాతీయ విద్యాపరిశోధన శిక్షణ సంస్థలో ప్రసంగించే అరుదైన అవకాశం వచ్చింది. ఈ మేరకు మండలంలోని ఉపాధ్యాయులతో పాటు పలువురు సామాజిక వేత్తలు,నాయకులు సత్కరించారు. జాతీయ విద్యా పరిశోధన మరియు శిక్షణ సంస్థ ఈ నెల 28,29 తేదులల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిసింది. మూల్యాంకన విధానంలో విద్యార్థుల స్థాయిని అనుసరించి సమతుల్యతను పాటించటంపై ప్రసంగించనున్నట్లు సురేష్ వివరించారు.

శివయ్య సేవలో అకౌంటెంట్ జనరల్

శ్రీకాళహస్తి,అక్టోబర్ 25 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం కేంద్ర డైరెక్టర్ ఆఫ్ అకౌంటెంట్ జనరల్ కె.సుబ్రమణ్యం కుటుంబసమేతంగా పూజలు జరిపించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద డెప్యూటీ ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి,పిఆర్ఓ రవి వేదపండితులచే స్వాగతం ఏర్పాటు చేసారు. ఆలయ ఇన్సెపెక్టర్లు హరియాదవ్, సుదర్శనం నాయుడులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిపై శిక్షణా కార్యక్రమం

తొట్టంబేడు, అక్టోబర్ 25 ప్రభాతవార్త : గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబందించి మాస్టర్ ట్రైనీల ద్వారా కడప, చిత్తూరు జిల్లాకు చెందిన సిఈవో, డిపిఓ, ఎంపిడిఓలకు శిక్షణా కార్యక్రమాన్ని ఈటిసి ప్రిన్సిపల్ నాగపద్మజ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నాగపద్మజ మాట్లాడుతూ వీరికి మాస్టర్ ట్రైనీల ద్వారా శిక్షణ ఇస్తున్నామని జిల్లాకు మండల స్థాయిలో శిక్షణ కోసం జిల్లాలో శిక్షణ పొందిన వారు మండల స్థాయిలో ఉన్న పంచాయతీ అధికారులుకు,ఈఓపిఆర్‌డిసంబందిత సిబ్బందికి శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఈటిసిప్రిన్సిపల్ నాగపద్మజ, వైస్ ప్రిన్సిపల్ విద్యారమ, ఎపిఎస్ఐఆర్‌డి జాయింట్ డైరెక్టర్ రమేష్, కడప సిఈవో ఓబులమ్మ,డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్‌లు సత్యసాయి, నంద్యాలజిల్లాలకు చెందిన సిబ్బంది హాజరయ్యారు.

కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందికి రక్షణ ఏది?

తొట్టంబేడు, అక్టోబర్ 25 ప్రభాతవార్త : కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సులకు, ఎఎన్ఎంలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో తొట్టంబేడు, కాసరం ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. కాసరం ఆరోగ్య కేంద్రం రిమోట్ ఏరియా కావడంలో ఇక్కడ పనిచేసే సిబ్బందికి రక్షణ లేకుండా పోతోంది. ఇక్కడి ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యాదికారులు ఉన్నా 24/7 సేవలు అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో రాత్రివేళల్లో ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్‌నర్సు, ఓఎఎన్ఎంలు అందుబాటులో ఉంటారు. వీరిలో పాటు కొత్తగా వాచ్‌మెన్‌ను నియమించారు. అయితే గత రెండు రోజుల క్రితం కాసరం ఆరోగ్యకేంద్రంలో పరిధిలో పూడి సచివాలయంలో ఆరోగ్య కార్యకర్తగా పనిచేస్తున్న దేవి టీకాల కార్యక్రమం ముగించుకుని తిరుగు ప్రయాణంలో మందులను ఆరోగ్య కేంద్రంలో ఇచ్చేందుకు వెళ్తుంగా కాసారం-పిల్లమేడు మార్గంలోని తెలుగుగంగ కాలువ సమీపంలో ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి ఆరోగ్య కార్యకర్త దేవి మెడలో ఉన్న బంగారు చైను లాక్కుని వెళ్ళారు. దీంతో ఆమె తొట్టంబేడు పోలీసులకు పిర్యాదు చేసింది. అయితే ఈమార్గంలో రాత్రివేళల్లో ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే స్టాఫ్‌నర్సులు, ఎఎన్ఎంలకు రక్షణ లేదని తెలుస్తోంది.

అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసిన ఎలమంచిలి

తిరుపతి విద్య,అక్టోబర్ 25,ప్రభాతవార్త: ఎం ఆర్ పల్లి లో గల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఆఫీసు నందు అసిస్టెంట్ కమిషనర్ గా కొత్తగా నియమితులైన ఎన్ బాలకృష్ణ ని బాలాజీ నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ అధినేత,సినీ నిర్మాత ఎలమంచిలి ప్రవీణ్ ఆధ్వర్యంలో సినీ డైరెక్టర్ సోమసుందరం సినీ కొరియోగ్రాఫర్ పవన్ విక్కీ,టిడిపి నాయకులు కరణం హిమత్ మరియు వంశీ రమేష్ తదితరులు ఘనంగా సన్మానించారు. ప్రవీణ్ మాట్లాడుతూ బాలకృష్ణ గతంలో కూడా తిరుపతిలో మంచి ఆఫీసర్‌గాపేరు తెచ్చుకోవడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాలలో తమతోపాటు పాలుపంచు కున్నారని కొనియాడారు.

రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు ఇవ్వండి : తహశీల్దార్

చంద్రగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: రెవెన్యూ సమస్యలపై తమకు ఫిర్యాదులు అందజేస్తే పరిష్కరించగలమని తహశీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. మండల పరిధిలోని రెడ్డివారిపల్లిలో తహశీల్దార్ అధ్యక్షతన శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సి.సి.ఎల్.ఎ.వారి ఆదేశాల మేరకు.. మ్యుటేషన్స్, జాయింట్ ఎల్.పి.ఎంలు, భూమి తగాదాలు, సెక్షన్ 22(ఎ) అభ్యంతరాలు వంటి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి రిజిస్టర్ చేయడం ద్వారా ఆన్‌లైన్ పొందుపరచనున్నట్లు తెలిపారు. వీటిపై సమగ్ర పరిశీలనతో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేవతి ప్రకాష్ రెడ్డి, మండల సర్వేయర్ సురేష్‌బాబు, ఆర్ఐ భాస్కర్, విఆర్ఓ విజయ్‌కుమార్, విలేజ్ సర్వేయర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

కమ్మీలను సొమ్ము చేసుకున్న వైసీపీ నాయకులు!

విజయపురం, అక్టోబరు 25 ప్రభాతవార్త: పునాదికి వేసిన కమ్మీలను వైసీపీ నాయకుడు సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. జగనన్న గృహ నిర్మాణం జరుగుతున్న సమయంలో వైసీపీ నాయకుడు కమ్మీలను కట్ చేసి సొమ్ము చేసుకున్నారని, కొన్ని కమ్మీలను సొంత ఇంటి నిర్మాణాలకు వినియోగిం చుకున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పోలీస్‌స్టేషన్‌కు కూత వేటు దూరంలో ఉన్న కమ్మీలను దొంగతనం చేయడంపై పలువురు పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆరోపణలు చేస్తున్నారు. కమ్మీలను దొంగతనం చేయడంతో పునాదిపశువుల పాకగా మారింది. ఈ విషయమై సమగ్ర విచారణ నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయిపోటీలకు పీఆర్ మంగళం విద్యార్థి ఎంపిక

పుత్తూరురూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త: పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో 14 సంవత్సరాల లోపు బాలుర కబడ్డీ క్రీడా విభాగంలో మండలంలోని పరమేశ్వరమంగళం ఎస్‌కేఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న టి.వెట్రిసెల్వన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.చంద్రశేఖర్‌శెట్టి తెలిపారు. ఏ.చంద్ర, పీడీ నందకుమార్, శివప్రసాద్, రామ్మోహన్, మోహన్, సురేష్, రవి, శంకరమ్మ, షీలా, చండీశ్వరి, అమరజాబేగం, ఉపాధ్యాయులు అభినందించారు.

టీడీపీ సత్యత్వ నమోదు విజయవంతం చేయండి

సత్యవేడు, అక్టోబరు 25 ప్రభాతవార్త: తెలుగుదేశం పార్టీ అధిష్టానం పిలుపు మేరకు టీడీపీ సభ్యత్వ నమోదు గతం కంటే అధికమించేందుకు పార్టీ శ్రేణులంతా కలసి కట్టుగా నియోజకవర్గంలోనే ఏడు మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్లు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీపీలు, సహాయ సహకారాలు అందించాలని తెలియజేయాలని సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు తెలిపారు. ప్రతి రెండేళ్ళకు ఒక సారి సభ్యత్వ నమోదు, పార్టీ సంస్థాగత ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ పాలన ప్రజా వ్యతిరేకంగా సాగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి ముందుకు సాగుతుందని గుర్తు చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నాగరాజుకుప్పం విద్యార్థుల ఎంపిక

నగరి, అక్టోబరు 25 ప్రభాతవార్త: నగరి మండలం నాగరాజుకుప్పం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న మమత, నీరజ నగరి పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-17 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అలాగే పుత్తూరు ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14 కబడ్డీపోటీల్లో 9వ తరగతి విద్యార్థి జ్యోషా ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. వీరిని, పీడీ చెన్నకేశవరెడ్డిని శుక్రవారం కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు మునిరత్నం, సీనియర్ ఉపాధ్యాయులు రవిశేఖర్, ఉపాధ్యాయులు సన్మానించారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో రాజమండ్రి, బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యా యులు తెలిపారు.

ఆక్రమణలు తొలగించండి

నగరి, అక్టోబరు 25 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధిలోని ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి దుకాణ దారులకు హెచ్చరికలు జారీ చేశారు. పురపాలక సిబ్బందితో కలసి ప్రధాన వీధులు, టవర్‌క్లాక్ సెంటర్ కూడలిలో పర్యటించి రోడ్డు మార్జిన్లు ఆక్రమించిన వారికి స్వయంగా సదరు ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. ఆక్రమణలను స్వతహాగా తొలగించుకోని ఏడల పురపాలక సంఘ సిబ్బందితో తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీవో వి.ఎల్.ఎన్.మూర్తి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

-15 రోజులు రిమాండ్ విధించిన ఇన్‌చార్జి మెజిస్ట్రేట్

నగరి, అక్టోబరు 25 ప్రభాతవార్త: ఇళ్ళలో చోరీకి పాల్పడి నగదు, వస్తువులు అపహరించిన కేసులో చోరీ దారులను పోలీసులు అరెస్టు చేయగా వారికి ఇన్‌చార్జి మెజిస్ట్రేట్‌గా గోపాలకృష్ణ 15 రోజులు రిమాండ్ విధించారు. తమిళనాడు అరక్కోణం నుంచి మండలంలోని ఓజీ కుప్పం గ్రామానికి గంజాయి కొనడానికి వచ్చి డబ్బులు చాలకపోవడంతో తడుకుపేట జగనన్న కాలనీ వద్ద ఒక జంటను బెదిరించి రూ.2 వేలు దోచుకున్న నరేంద్రన్ అలియాస్ అజిత్(21), హుస్సేన్(23), రోహిత్(22) అనే ముగ్గురుని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. వీరికి ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ 15 రోజుల రిమాండ్ విధించారు.

రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు నవ్యశ్రీ

నగరి, అక్టోబరు 25 ప్రభాతవార్త: నగరి మండలం ముడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి నవ్యశ్రీ రాష్ట్ర స్థాయి చదరంగ పోటీలకు ఎంపికైంది. తిరుపతి, శ్రీనివాస స్పోర్ట్ కాంప్లెక్స్ వేదికగా నిర్వహించిన 68వ ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి చదరంగ పోటీలో అండర్-17 బాలికల విభాగంలో ప్రతిభకనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. విద్యార్థిని, చెస్‌కోచ్ ఆనందమోహన్‌ని పాఠశాల ప్రధానోపాధ్యాయులుమురళీకృష్ణఅభినందించారు. బాపట్లలోజరిగేరాష్ట్రస్థాయిపోటీలకువిద్యార్థిహాజరవుతుందన్నారు

సారా ఊట ధ్వంసం

నగరి, అక్టోబరు 25 ప్రభాతవార్త: మున్సిపల్ పరిధి సత్రవాడ చెరువు సమీపం నాటుసారా తయారు చేస్తున్న కరివర్ధన్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టుచేసి శుక్రవారం రిమాండ్‌కు పంపారు. సీఐ మహేశ్వర్ తెలిపిన వివరాల మేరకు... సత్రవాడ చెరువు వద్దకు చేరుకున్న పోలీసులు సారా తయారు చేస్తున్న కరివర్ధన్‌ను అరెస్టు చేయడంతో పాటు 200 లీటర్ల సారాయి ఊటను ధ్వంసం చేశారు. అక్కడే ఉన్న ఐదు లీటర్ల సారాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా ఇన్‌చార్జి మెజిస్ట్రేట్ గోపాలకృష్ణ 15 రోజులు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

28న హిమజ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

పుత్తూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త : ఈ నెల 28వ తేదీన రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, డిఆర్‌డిఎలు సంయుక్తంగా స్థానిక హిమజ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు హిమజ విద్యా సంస్థల ఛైర్మన్ ఎం.సురేంద్రరాజు, కాలేజీ ప్రిన్సిపల్ ఎన్.లోకనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయిదు బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్న మేళాకు 18 నుంచి 32 సంవత్సరాల మధ్య వయస్సున్న పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిలైన స్త్రీ, పురుష అభ్యర్థులిరువుతూ హాజరు కావచ్చని తెలిపారు. నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్నివివరాలకురసూల్6300954441,లోకేష్ 9963561755 నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

శ్రీవారి సేవలో ఎంపి గురుమూర్తి

తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి దర్శించుకున్నారు. టిటిడి అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

తిరుమలకు చేరుకున్న

కేంద్రమంత్రి శోభాకరంద్గాజే

తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి: శ్రీవారి ఆశీస్సులకోసం కేంద్రమంత్రి శోభాకరంద్గాజేతిరుమలకు చేరుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆమెకు టిటిడి వసతికల్పన విభాగం ఓఎస్‌డి సత్రానాయక్ స్వాగతం పలికారు.

ఎన్‌డిఎ కూటమి హామీలను అమలు చేయాలి

-పిసిసి ప్రధానకార్యదర్శి సుధాకర్‌రెడ్డి

తిరుపతి,అక్టోబర్ 25ప్రభాతవార్త: రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలుచేయాలని, ప్రజలకు మంచి చేయాలని పిసిసి ప్రధాన కార్యదర్శి, తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఈద సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. దేశంలోని బిజెపి ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. శుక్రవారం తిరుపతిలోని యూత్‌హాస్టల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు, నెల్లూరుజిల్లా అధ్యక్షుడు మాంగాటి గోపాల్‌రెడ్డి, ఏఐసిసి బిసి సెల్‌కో ఆర్డినేటర్ కంభంపాటి మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు గోపీగౌడ్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, డిసిసి ప్రధాన కార్యదర్శి లోకేశ్, జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు కలందర తదితరులు పాల్గొన్నారు. నవంబర్ 7వతేదీ విజయవాడలో పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పార్టీనాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారన్నారు.

తిరుపతి డివిజన్

నగేష్‌కు యావజ్జీవ శిక్ష!

న్యాయస్థానం తీర్పుతో ఉలిక్కిపడ్డపూడి సీకే పురం

కేవీబీ పురం, అక్టోబరు 25 ప్రభాతవార్త: హత్యకేసులో ముద్దాయికి యావజ్జీవ శిక్ష న్యాయస్థానం విధించినట్లు కేవీబీ పురం మండల పోలీస్‌స్టేషన్ ఎస్ఐ వీరాంజనేయులు తెలిపారు. ఎస్ఐ తెలిపిన సమాచారం మేరకు... 2019 సంవత్సరంలో కేవీబీపురం మండలంలోని పూడి సీకే పురం గ్రామానికి చెందిన గుంజి నగేష్ అదే గ్రామానికి చెందిన అలుపూరు వంశీకృష్ణను అడవికి తీసుకెళ్లి ఘోరంగా చంపినట్లు తెలిపారు. విచారణలో భాగంగా 12వ అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీనివాసులు నాయక్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరరాఘవరెడ్డి వాదనలు ఏకీభవించి హత్య కేసు రుజువు కావడంతో ముద్దాయి నగేష్‌కు యావజ్జీవ శిక్ష ఖరారైనట్లు ఎస్ఐ తెలిపారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్, నారాయణవనం రూరల్ సీఐ భాస్కర్‌నాయక్‌లు కేసు దర్యాప్తులో సహకరించిన అప్పటి ఎస్ఐ అదే విధంగా హెడ్ కానిస్టేబుల్ విశ్వనాథం కోర్టు కానిస్టేబుల్ దాములను న్యాయస్థానం అభినందించింది. ముద్దాయి నగేష్‌కు యావజ్జీవ శిక్ష న్యాయస్థానం విధించడంతో పూడి సీకే పురం విషాధచాయలు అలుముకున్నాయి.

ముఖ్యమంత్రిని కలసిన కేవీబీపురం టీడీపీ నాయకులు

కేవీబీ పురం, అక్టోబరు 25 ప్రభాతవార్త: రా

టిడిపి సభ్యత్వ నమోదు విజయవంతం చేయండి

-ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపు నిచ్చారు. టిడిపి సభ్యత్వం తీసుకునే వారికి అనేక ప్రయోజనాలు వున్నాయని తెలిపారు. కేవలం 100 రూపాయలు చెల్లించి సభ్యత్వం తీసుకుంటే ప్రమాద బీమా రూ. 5లక్షలు, సహజ మరణానికి రూ. 10వేలు వర్తిస్తుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి ప్రారంభం కానున్న సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బూత్ ఇన్‌ఛార్జ్‌లు, యూనిట్, క్లస్టర్, గ్రామ, వార్డు అధ్యక్షులు కృషి చేయాలని కోరారు.

కొండపై పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత

-ఔటర్‌రింగురోడ్డులో అదనపు క్యూలైన్లలో మరిన్ని సదుపాయాలు -టిటిడి ఈఓ శ్యామలరావు

తిరుమల,అక్టోబర్ 25ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలక్షేత్రంలో శుభ్రతకు అధిక ప్రాధాన్యత నివ్వాలని, ఇక్కడ భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని టిటిడి ఈఓ జె.శ్యామల రావు, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశించారు. భక్తులకు క్యూలైన్లలో, వెలుపల అదనపు క్యూలైన్లలో సకల సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఔటర్‌రింగురోడ్డులో భక్తుల సౌకర్యార్థం నిర్మితమవు తున్న నూతన క్యూలైన్లు, మరుగుదొడ్లు,పుడ్‌కోర్టులను ఇద్దరూ తనిఖీ చేశారు. అలాగే కౌస్తుభం, సప్తగిరి, ఎస్ఎంసి, షాపింగ్ కాంప్లెక్స్‌ల వద్ద హోటళ్ళను తనిఖీ చేశారు. శుభ్రత పాటించాలని, ధరల బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతర శిలాతోరణం వద్దకు వెళ్ళి యాత్రికులు సందర్శనకు అనువైన వాతావరణం కల్పించాలని తెలిపారు.

సిఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

పుత్తూరు, అక్టోబరు 25 ప్రభాతవార్త:ఉచిత ఇసుక విధానాన్ని ప్రకటించి నందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చిత్రపటానికి శుక్రవారం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక కార్పేటినగరం రోడ్డు కూడలిలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబునాయుడుకు దక్కుతుందన్నారు. సీనరేజ్, జిఎస్టీ కూడా లేకుండా ప్రజలకు పూర్తిగా ఇసుకను ఉచితంగా అందిస్తున్నారని తెలిపారు. గతంలో వేలాది రూపాయలు పెట్టి ఇసుక కొనుగోలు చేయలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని, ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారని తెలిపారు. ప్రస్తుతం ఉచితంగా ఇసుక లభిస్తుండడంతో ఆయా వర్గాల్లో సంతోషం వ్యక్తమవుతోందని తెలిపారు. కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీనాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదరి ్శ ఇ.రవినాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, మాజీ ఎంపిటిసి పాండురంగయ్య, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు విజయశేఖర్‌నాయుడు, మహిళా విభాగం నగరి నియోజకవర్గ కార్యదర్శి నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

పశుగణనతో పాడిరైతులకు మెరుగైన జీవనోపాధి : పులివర్తి

చంద్రగిరి, అక్టోబర్ 25 ప్రభాతవార్త: పాడిరైతులకు మెరుగైన జీవనోపాధి కల్పించడానికి పశుగణన దోహదపడగలదని ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. స్థానిక వెటర్నరీ హాస్పిటల్ (మండల పరిషత్ కార్యాలయం) ఆవరణలో శుక్రవారం ఆయన 21వ అఖిల భారత పశుగణన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగణనతో ప్రభుత్వం విధాన రూపకల్పనతో నిధుల కేటాయింపు చేయగలదని అన్నారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఇంటింటి సర్వేకి వచ్చినప్పుడు మీ ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, పందులు, కోళ్ళు వంటి మూగజీవాలు ఏవేవి ఎన్ని వున్నాయో వివరించాలని అన్నారు. ఆ మేరకు సర్వే చేసి మీ ఇంటికి ప్రభుత్వ లోగోతో కూడిన స్టిక్కర్ అతికించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, తహశీల్దార్ శివసుబ్బరామయ్య, ఇన్‌చార్జ్ ఎంపిడిఓ శేఖర్, ఏడి డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రదాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, మండల ఉపాధ్యక్షుడు శానంబట్ల తులసిరెడ్డి, నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, మొక్కల కుమార్‌రాజారెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, కన్నయ్య నాయుడు, పులికంటి మోహన్ రెడ్డి, ఉమాపతి రెడ్డి, దుబాసి రామమూర్తి, డిష్ గోపి, పశువైద్యులు డాక్టర్ కీర్తి, డాక్టర్ వంశీ, వినోద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలి

వడమాలపేట, అక్టోబరు 25 ప్రభాతవార్త: మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యంతో రైతులకు సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం జిల్లా ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ భాస్కరయ్య కోరారు. పుత్తూరు డివిజన్ పరిధిలో పని చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు, వడమాలపేట ఎంపీడీవో సమావేశ మందిరంలో శిక్షణ ఇచ్చారు. బతకడానికి ఆహారం తయారు చేసే రైతుల సేవే సృష్టిలో అత్యుత్తమైన సేవ అని చెప్పారు. సమస్యలతో సతమతమవుతున్న నేటి రైతులకు ఆధునిక సాగు పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అంది పుచ్చుకుని రైతులకు సేవలు అందించాలని సిబ్బందిని కోరారు. వాతావరణ సమాచారం, నేడు సులభంగా అందుబాటులో ఉందని, దీని ఆధారంగా రైతులకు మార్గ నిర్దేశం చేయాలని తెలిపారు. వ్యవసాయ పరిశోధన స్థానం పెరుమాళ్ళపల్లె శాస్త్రవేత్త డా.నాగమణి సాగులోచీడల వృద్ధికి సహకరించే అంశాలు వాటిని అదుపు చేయుటకు వలసిన చర్యల గురించి వివరించారు. శిక్షణ ముగింపులో సిబ్బందికి పరీక్షనిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పుత్తూరు ఏడీఏ రమేష్, శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతుల సేవలకు వినియోగించి వారి అభివృద్ధికి పాటు పడాలని కోరారు.

శివారు ప్రాంతాలలో పారిశుద్ధాన్ని మెరుగుపరచండి

-చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 25 ప్రభాతవార్త : తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ నిధులతో చంద్రగిరి నియోజకవర్గంలో శివారు ప్రాంతాలలో పారిశుద్ధ్యం, మురికివాడల్లో మౌళిక వసతులు కల్పించాలని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఉపాధ్యక్షులు ఎన్. మౌర్యను కోరారు. శుక్రవారం తిరుపతి పట్టణాభివృద్ధి శాఖ ఉపాధ్యక్షులు ఎన్. మౌర్యను చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాభినందనలు తెలిపారు. అనంతరం పలు అంశాలపై మాట్లాడారు. తుడా పరిధిలోని నగర శివారు ప్రాంతాలలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని కోరారు. ముఖ్యంగా మురికి వాడలలో మౌలిక వసతులు కల్పనకు ఉదారంగా నిధులు కేటాయించాలని తెలిపారు. సిమెట్ రోడ్లు, త్రాగునీటి సౌకర్యాలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తిరుపతి ప్రధాన నగరం నుంచి మురగునీటి శివారు ప్రాంతంలోకి ప్రవహిస్తున్నదని అలాంటి వాటిని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలన్నారు. అన్ని సమస్యలను విన్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, తుడా ఉపాధ్యక్షులు ఎన్. మౌర్య పరిశీలించి ప్రజా సంక్షేమం దిశగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే నానికి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట టిడిపి నాయకులు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు అన్నారు.

క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం

-పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్

కాణిపాకం, అక్టోబర్ 25 ప్రభాతవార్త: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీక దృఢత్వం కలుగుతుందని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు జరుగనున్న 43వ రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల ఖోఖో పోటీలు 2024-2025 శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఏర్పాటు ప్రారంభో త్సవ సమావేశానికి చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్‌తో కలసి పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మారసిన ఉల్లాసాన్ని, దేహదారుఢ్యాన్ని పెంపొందిచు తాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ స్థాయి క్రీడలైన ఖోఖో, కబడ్డీ క్రీడలు ద్వారా సంపూర్ణమైన వికాసాన్ని పొందవచ్చునని తెలిపారు. అలాగే క్రీడాకారులతో ఏకాగ్రత కూడా పెరుగుతుందన్నారు. ఇటువంటి క్రీడలు తాను ప్రాతినిద్యం వహిస్తున్న పూతలపట్టు నియోజకవర్గంలో విఘ్ననాదుని చెంత నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి ప్రత్యేక పాలసీని తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా చిత్తూరు ఎమ్మెల్యే గురుజాల జగన్మోహన్ మాట్లాడుతూ గణనాధుని చెంత రాష్ట్రస్తాయి ఖోఖో పోటీలు నిర్వహించడం, ఈపోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి క్రీడాకారులు పాల్గొనడం ఆనందదాయకమన్నారు. ఈ క్రీడల ను విజయ వంతంగా నిర్వహిస్తున్న జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీన్‌ను ఆయన అభినందించారు. అలాగే జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు నల్లబోతుల ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి ఖోఖో క్రీడలను కాణిపాకంలో నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ ఎంతో సహకారం అందిస్తున్నారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఐరాల మండల టీడీపీ అధ్యక్షుడు వి.గిరిధర్‌బాబు,కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర చౌదరి,నాయకులు హరిబాబునాయుడులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా : ఎమ్మెల్యే

డక్కిలి.అక్టోబరు25 ప్రభాతవార్త; వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలంలోని దేవుడు వెల్లంపల్లి, డి.వడ్డిపల్లి, లింగసముద్రం గ్రామాలలో శుక్రవారం పల్లె వెలుగు కార్య క్రమంలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపణలు ప్రారంభోత్స వాలు చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు మూడోసారి వెంకటగిరి ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన ప్రజలను మరవలేనని చెప్పారు. అందుకే తాను ప్రజలతో మమేకం అవుతున్నట్లు వివరించారు. ఒక్కోసారి తనపై నాయకులకు బాధగా కూడా ఉంటుందని తెలిపారు. ఎందుకంటే కొన్ని గ్రామాల నుంచి పలు సమస్యలను ప్రజలు నేరుగా వివరించిన వెంటనే వాటిని పరిష్కరించి ప్రజల ఇబ్బందులు తీరుస్తున్నట్లు చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గ అభివృద్ధికి తాను శాయశక్తులా కష్టపడి పని చేసి నియోజకవ్గ ప్రజలు రుణం తీర్చుకుంటానని తెలిపారు డి. వడ్డిపల్లి గ్రామానికి ఎమ్మెల్యే వరాలు జల్లు... డి.వడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే రామకృష్ణ రూ35 లక్షలతో నిర్మించిన సచివాలయం భవనంను ప్రారంభించారు. వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ కన్వీనరు ఎస్.ఎస్.ఆర్ నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి కూటమి పాలనలో రాష్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని చెప్పారు.ఇచ్చిన హమీలు నెరవేర్చడం జరగుతుం దన్నారు. డి.వడ్డిపల్లి గ్రామానికి తారు రోడ్లు వేయించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి మండల టీడీపీ అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, తహశీల్దారు మోపూరు శ్రీనివాసులు,ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి, ఉపాధి హమీ ఏపీవో లక్ష్మీనారాయణ,ఈసీ దామోదర రాజు, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి,రమేష్ నాయుడు,యువరాజు, వెంకటపతి, దాము నాయుడు, బీజేపీ డక్కిలి మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎన్.గుండాలు దేవర, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ గూండాయిజం చేస్తే ఊస్తూ ఊరుకోం : టిడిపి

కోట, అక్టోబర్ 25 ప్రభాతవార్త : పెళ్లకూరు మండల వైసీపీ నాయకులు కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి గూండాయిజం చేస్తే టిడిపి నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని కోట మండల టిడిపి అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమరెడ్డి, టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ అన్నారు. శుక్రవారం స్థానిక టిడిపి నాయకులు సర్వోత్తమరెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడు గంగా ప్రసాద్‌పై నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సత్య నారాయణరెడ్డి శవ రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక, మద్యం, భూకబ్జాలు, అవినీతి అక్రమాలకు పాల్పడింది మీరేనని విమర్శించారు. నియోజక వర్గంలో మద్యం దుకాణాల విషయంలో తెలుగుదేశం పార్టీ పారదర్శకంగా వ్యవహరించిందని అన్నారు. మద్యం దుకాణదారులను బెదిరించామని ఆరోపించడం తగదన్నారు. మేము బెదిరించి ఉంటే మీ పార్టీ వారికి ఒక్క షాపు కూడా దక్కేది కాదని అన్నారు. 40 ఏళ్ల చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీ ప్రస్థానం ఎంతో క్రమశిక్షణ కలిగి ఉందని గుర్తు చేశారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే ప్రతీకార చర్యలుంటాయని అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు మోహన్‌రెడ్డి, తూపిలి రాధాకృష్ణారెడ్డి, మధుయాదవ్, మర్రి పోలయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీచెంగాళమ్మ సేవలో జిల్లా అదనపు జడ్జి

సూళ్లూరుపేట, అక్టోబర్ 25 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాత పరమేశ్వరిదేవిని నెల్లూరు జిల్లా ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కమ్ వి అదనపు జడ్జి ఎన్.సరస్వతి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆమెకు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలలో నైపుణ్య అవగాహన

గూడూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త : గూడూరు మండలంలోని ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల, కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ విశాఖ పట్నం పరస్పర ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన ఒప్పందం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ సలహాదారు వై.రామ్మోహన్ రావుతో ఇంచార్జి ప్రిన్సిపాల్ డా. టి. వేణుమాధవ్ అవగాహన పత్రాలను మార్చుకున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సాంకేతిక మీద సి డాక్, ఐఐఇ ద్వారా ఎస్సి, ఎస్టీ విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటుగా ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఎన్ఐఈఎల్ఐటి 3డి ప్రింటింగ్, రోబోటిక్ ప్రాసెసింగ్, ఇంటర్నెంట్ ఆఫ్ థింగ్స్ పై వాధ్వాని ఫౌండేషన్ ద్వారా 21వ శతాబ్దపు ఉపాధి నైపుణ్యాలను, పారిశ్రామిక వ్యవస్థాపకత శిక్షణ అందిస్తామని కన్సల్టెంట్ వై.రామ్మోహన్ రావు చెప్పారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ వంకి అనూష, డీన్ అకాడమిక్స్ డా. రాజయ్య, డా. ధనుంజయ, ఏసీఐసిసి సిఈవో డాక్టర్ ఇమ్మానియేల్, వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

రీ సర్వే సమస్యలను సత్వరంగా పరిష్కరిస్తాం : తహశీల్దార్

తిరుపతిరూరల్, అక్టోబర్25 ప్రభాతవార్త: రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలను 15రోజులలో పరిష్కరిస్తామని తిరుపతిరూరల్ తహశీల్దార్ రామాంజుల నాయక్ తెలిపారు. రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కార వేదికను శుక్రవారం తిరుపతిరూరల్ మండలం తనపల్లిలో నిర్వహించారు. రీ సర్వేలో తలెత్తిన సమస్యలపై గ్రామసభ నిర్వహించారు. తనపల్లి గ్రామ పంచాయతీలో 272 ఎకరాల 3సెంట్ల భూమి కలదని, పక్కాగా రీ సర్వే నిర్వహించడం జరిగిందని తెలిపారు. గతంలో చైన్లతో, టైపులతో భూమిని కొలిచేవారని, అలా కాకుండా నిర్దిష్ట కొలత మేరకు రోవర్‌ను వినియోగించి, పక్కాగా కొలతలు చేసినట్లు తెలిపారు. రీ సర్వే చేసి దాదాపు 100 సంవత్సరాలు పైబడిందని, భూమి విస్తీర్ణంలో 1,2 సెంట్ల భూమి తగ్గినంత మాత్రాన ఏమి కాదని, హద్దురాళ్ళు మాత్రం ఎక్కడికి అక్కడే ఉంటాయని తెలిపారు. భూ సరిహద్దు రాళ్లు లేనిచోటనే కొత్త సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 2వేల గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, రీ సర్వేలో తలెత్తిన భూ సమస్యలు పరిష్కరించుటకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ అండ్ సర్వే ఏ.డి.అరుణ్‌కుమార్, డివై ఐఎఎస్ చిట్టిబాబు, ఐఎఎస్‌లు రాంప్రసాద్, కృష్ణాకర్, ఆర్.ఎస్.డి.టి మోహన్‌బాబు, సర్వేయర్ హేమ కుమార్, విఆర్వో వలర్‌మతి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, టిడిపి అధ్యక్షుడు బాలచంద్రారెడ్డి, రైతులు వినోద్‌కుమార్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, చెంచురెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల పట్ల దయతో వ్యవహరించండి:బొజ్జల

శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 25 ప్రభాతవార్త : ప్రస్తుతం వర్షాకాలం. శ్రీకాళహస్తి నియోజక వర్గం పశుగణాభివృద్ధికి పెట్టింది పేరు. నోరులేని మూగజీవాలకు సేవలందించే భాగ్యం భగవంతుడు మీకు కల్పించాడు. దయతో వ్యవహరించండి అని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి మండల ఊరందూరు గ్రామంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాలకు సంబంధించిన గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది రైతుల ఇళ్ళ వద్దకు వచ్చినపుడు పాడిరైతులు సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ ఎన్.వి.శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఐదు సంవత్సరాలకు ఒక సారి పశుగణన నిర్వహిస్తామన్నారు. ఈ గోడపత్రికల ఆవిష్కరణలో డ్వార్ ఊహా,రవీంద్రవర్మ, అరుణ్‌వర్మ కుమార్, ఉషా, శరత్ పలువురు సహాయకులతో పాటు శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ చెంచయ్యనాయుడు లు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వధ్యేయం

- త్వరలోనే మహిళలకు ఉచిత బస్సుసేవలు - నూతన బస్సుసర్వీసులను ప్రారంభించిన ఎమ్మెల్యే

చిత్తూరురూరల్, అక్టోబరు 25 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం చిత్తూరు ఆర్టీసి 2 డిపో నందు 7 నూతన బస్సు సర్వీసులను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ జండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రవాణాశాఖామంత్రి రాంప్రసాద్ సహకారంతో గడచిప ఐదు నెలల్లో 27 బస్సులను ప్రారంభించామని, పేద ప్రజలకు మెరుగైన సౌకర్యాన్ని అందించడానికి ఈరోజు మరో ఆరు నూతన సర్వీసులు, విద్యార్థుల కోరిక మేరకు ఒక టౌన్ సర్వీసును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అనంతరం చిత్తూరు బస్టాండు నుంచి కలెక్టరేట్, ప్రశాంత్‌నగర్ మీదుగా అనుపల్లి టౌన్ సర్వీసును ఎమ్మెల్యే స్వయంగా గాంధీ సర్కిల్ వరకు నడిపారు. గడచిన 5 ఏళ్ల వైకాపా పాలనలో ఏపిఎస్ఆర్టీసిలో ఉన్నత పదవులు అనుభవించిన నాయకులు సైతం చిత్తూరుకు ఒక్క బస్సు కేటాయించిన పాపాన పోలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామి మేరకు త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఆర్ఎం జగదీష్, 1, 2 డిపోల మేనేజర్లు కృష్ణమూర్తి,రూపశ్రీ, ఆర్టీసి సిబ్బంది, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ అముద, మాజీ మేయర్ కఠారి హేమలత, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్, సీనియర్‌నాయకులు వసంత్‌కుమార్, ఉమ్మడి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కేంద్ర మంత్రి రామ్మోహన్

తిరుచానూరు, అక్టోబర్ 25 ప్రభాతవార్త : తిరుచానూరు పద్మావతి అమ్మవారిని కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు దర్శించుకున్నారు. ఆయనను ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్ ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం నమస్కరించారు. అనంతరం వేద పండితులు అమ్మవారి దర్శనభాగ్యాన్ని కల్పించారు. తరువాత ఆశీర్వాద మండపం వద్ద ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. అంతక ముందుగా ఆలయం వెలుపల కూటమి నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. వారి వెంట ఎడిపై పాఠశాల డైరెక్టర్ ప్రణీత్, శ్రీకాళహస్తి బిజేపి నాయకుడు కోలా ఆనంద్, చంద్రగిరి తెదెపా నాయకుడు బడిసుదా యాదవ్, నాని, రాజేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమేష్, ఎస్ఐ సాయినాథ్ చౌదరి, ఇతర ఆలయను అధికారులు పాల్గొన్నారు.

పారామెడికల్ ఫెస్ట్ సారంగ్ ప్రారంభం

తిరుపతి హెల్త్, అక్టోబర్ 25 ప్రభాతవార్త : ఎస్వీ వైద్య కళాశాలలో మొట్ట మొదటి సారిగా పారామెడికల్ విద్యార్థులు, వైద్య విద్యార్థులకు సమానంగా పారామెడికల్ ఫెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ పిఏ చంద్రశేఖరన్ ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా రిటైర్డ్ జడ్జి రాజీవ్, నేషనల్ మెంటల్ హెల్త్ కమిషన్ బోర్డ్ చైర్మన్ పాల్గొన్నారు. డిప్లమా ఇన్ ఆనస్తీషాలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు తెచ్చుకున్న సుబ్రమణ్యం అనే విద్యార్థికి బంగారు పతకం, కీర్తిశేషులు ఏ బిఎస్ సుమంత్‌రెడ్డి జ్ఞాపకార్థంగా పారామెడికల్ విద్యార్థులకు ప్రతి సంవత్సరం బంగారు పథకాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనస్థిషియా డిపార్ట్మెంట్ వారు పారితోషకం కూడా బహుకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వర్లు, వైద్యులు వైద్య అధ